క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

శంకరపట్నం: ఇందిరా మహిళాశక్తితో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించవచ్చని వివో అధ్యక్షురాలు జహేదా అన్నారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో బుధవారం మహిళా సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంపేరిట 15 రకాల వ్యాపార కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. వ్యాపార రంగాల్లో రాణించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తుందని, ఈ నెల18 వరకు గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సమావేశాలు జరుగుతాయన్నారు.

'పదేళ్ల పాలనలో రోడ్డు గుర్తుకు రాలేదా'

గన్నేరువరం: పదేళ్లు మానకొండూర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు డబుల్ రోడ్డు దుస్థితి గుర్తుకు రాలేదా అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. మండలకేంద్రంలో బుధవారం మాట్లాడారు. మండల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించమని, రోడ్డు కోసం బైక్ ర్యాలీ, ధర్నాలు చేసుకున్నా అభ్యంతరం లేదని, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మె పరిస్థితి లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, బొడ్డు సునిల్, మాతంగి అనిల్, మార్గం మల్లేశం, బద్దం సంపత్‌రెడ్డి, దొగ్గల ప్రదీప్, విజేందర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగాలి


మాట్లాడుతున్న మల్లి ఓదెల

మానకొండూర్: అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని మానకొండూర్ వ్యవసాయ మార్కెటు కమిటీ చైర్మన్ మల్లి ఓదెలు అన్నారు. బుధవారం మార్కెటు కమిటీ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు కృషి చేయాల్సి ఉందన్నారు. రంగపేట వద్ద గోదాం, ప్రహరీ, సీసీ, వ్యవసాయ మార్కెటు ఆవరణలో విశ్రాంతి భవనం, తదితర పనుల కోసం మంత్రులను కలవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, డైరెక్టర్లు రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, సాయిరి దేవయ్య, చలిగంటి ఓదెలు, టేకుమల్ల అంజయ్య, బండెల మహేందర్, మహిపాల్, రావుల రవి, వేల్పుల రాజు సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

వీణవంక: గ్రామ పంచాయతీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరెం భానుచందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందనే భయంతో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడంలేదని, దీంతో జీపీల్లో పాలన కుంటుపడుతోందని ఆరోపించారు. నిధులు లేక ట్రాక్టర్లకు డిజిల్ కొనలేని దుస్థితి నెలకొందని, కొందరు కార్యదర్శులు సొంతంగా డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని, ఇప్పటికై నా ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

కుళ్లిన కూరగాయలతో విద్యార్థులకు ఆహారం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో కుళ్లిన కూరగాయలతో విద్యార్థులకు ఆహారం వండుతున్నారని వైద్యాధికారి శ్రావణ్ తెలిపారు. బుధవారం వైద్యసిబ్బందితో కలిసి హాస్టల్ వంటగదిని పరిశీలించారు. కుళ్లిన అరటిపండ్లు, కూరగాయలు వినియోగిస్తున్నారని గుర్తించారు, హాస్టల్ పరిసరాల్లో వర్షం నీరు నిలిచిందని, ఏపుగా పెరిగిన చెట్ల గుబురు, విషపురుగులతో విద్యార్థులకు ప్రమాదం ఉందని, వార్డెన్ సైతం అందుబాటులో ఉండటం లేదన్నారు.

విద్యార్థుల భారీ ర్యాలీ



హుజూరాబాద్: జాతీయ విద్యార్థి దినోత్సవం పురస్కరించుకొని ఏబీవీపీ హుజూరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని విద్యార్థులు బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొస్కుల అజయ్ మాట్లాడుతూ... విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి పెట్టి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. విద్యా రంగాభివృద్ధి కోసం ఏబీవీపీ చేస్తున్న ఉద్యమ ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి వరికోలు రాజు, పెరుగు అభిలాశ్, నగర ఉపాధ్యక్షులు. ఎనగంటి కిరణ్, బొరుగాల గౌతమ్, సిద్దార్థ, దాట్ల అక్షయ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఇవేమి దారులు..


బురదమయంగా జయశంకర్‌కాలనీ రోడ్డు


శాయంపేట-నాగంపేట గ్రామాల రోడ్డు


సిరిసేడు నుంచి భోగంపాడు


హుజూరాబాద్ పట్టణంలో ఇరుకుగా మారిన అంబేడ్కర్ చౌరస్తా

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కరీంనగర్-వరంగల్ ప్రధాన రోడ్డు ఇరుకుగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. చౌరస్తా పెద్దగా, దాని పక్కన రోడ్డు ఇరుకుగా మారడంతో పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే చిన్న వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. అనుకొని ప్రమాదం జరిగితే బాధ్యులెవరని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

చొప్పదండి: పట్టణంలో జయశంకర్‌కాలనీ రోడ్డు బురదమయంకావడంతో రైతులు, కాలనీవాసులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు నీటి గుంతల్లో కనీసం మొరం పోయించడంలేదని విమర్శిస్తున్నారు. ఎండా కాలంలో నీటి లీకేజీతో గుంత ఏర్పడగా ఇప్పుడు వర్షం నీటితో నిండుకుందని, ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు నుంచి భోగంపాడుకు వెళ్లే రోడ్డు గుంతలమయమైంది.ఏళ్ల క్రితం నిర్మించడంతోపాటు కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. భోగంపాడుకు వెళ్లాలంటే మల్రెడ్డి మీదుగా అదనంగా రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించి వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

జమ్మికుంట రూరల్: మండలంలోని శాయంపేట, నాగంపేట, గండ్రపల్లి గ్రామాల మధ్య రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇసుక ట్రాక్టర్లు, భారీ వాహనాల కారణంగా వాహనదారులు ప్రమాదాలబారినపడుతున్నారు. సంబంధిత అధికారులు గుంతలు పూడ్చివేయించాలని, ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సైదాపూర్: సైదాపూర్‌లో మురుగుకాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో మురుగునీరు రోడ్డుపై పారడంతోపాటు దుర్గంధం వెలువడుతోందని, దోమలు వృద్ధిచెందుతున్నాయని, రోగాల బారిన పడతామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారి, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా కాలువలు శుభ్రం చేయించే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
బి.సారయ్య,పంచాయతీ కార్యదర్శి, సైదాపూర్ సెల్ నంబర్: 9676990912

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడొద్దు


చొప్పదండి: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


హుజూరాబాద్‌లో మున్సిపల్ వర్కర్స్...


చిగురుమామిడిలో ఆశా కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో బుధవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. నూతన లేబర్ చట్టాలను రద్దు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం, సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, ప్రభుత్వ రంగసంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసేందుకు కొత్త చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. పదిగంటల పనివిధానాన్ని రద్దుచేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలన్నారు.

రేపటి నుంచి భగీరథ నీటి సరఫరా నిలిపివేత

కరీంనగర్‌రూరల్: కొత్తపల్లి మండలం ఎలగందల్‌లోని మిషన్ భగీరథ ప్రధాన నీటి శుద్ధి కేంద్రం మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 11, 12ల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు హుజూరాబాద్ మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.రామ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్, కొత్తపల్లి, రామడుగు మండలాలతోపాటు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీన గ్రామాలకు నీటి సరఫరా ఉండదని వివరించారు. ఆయా మండలాల్లోని గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధి కారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరణ

ఇల్లందకుంట: ఇల్లందకుంట తహసీల్దార్‌గా డి.రాజమల్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ అర్బన్ నుంచి బదిలీపై రాగా ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రాణి హనుమకొండకు బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ మన్విత్ సింగ్, ఆర్ఐ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ రామారావు, గాదె గుణసాగర్, పరమేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి రాములోరి చిత్రపటం బహూకరించారు.

నేడు సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నామని సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి ప్రత్యే పూజలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు తెలిపారు. సాయంత్రం సాయిబాబా రథయాత్ర పట్టణంలోని వివిధ వాడల గుండా సాగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన వన మహోత్సవానికి హాజరై స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యులను చేసి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పురమల్ల మనోహర్, వెలిచాల తిరుమల్‌రావు, బూర్గు గంగన్న, సత్తు కనుకయ్య, వేముల భాస్కర్, తోట సంధ్యకరుణాకర్, గుజ్జుల బాపురెడ్డి, అట్ల శేఖర్‌రెడ్డి, కంకణాల రాజగోపాల్‌రెడ్డి, గునుకొండ బాబు, పడితపలిల కిషన్, పడాల రాజన్న, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, రుద్ర మల్లేశం, మధు, తాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



గంగాధర: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల కారోబార్లు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పొరండ్ల తిరుపతి, ఉపాధ్యక్షులుగా సుంకెపాక హరీష్, వడ్లూరి మహేందర్, ప్రధాన కార్యదర్శిగా అమిరిశెట్టి సత్యం, కోశాధికారిగా సమానపల్లి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఎర్రం శ్రీనివాస్, గడ్డం పర్శరాములుగౌడ్, కార్యవర్గ సభ్యులుగా దూలం తిరుపతి, రమేష్, పర్శరాములు, దయాకర్ ఎన్నికయ్యారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన


ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర సభ్యులు

ఇల్లందకుంట: స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు రమేశ్, రాణి మండలంలోని సీతంపేట, బూజునూరు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. జీపీలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రతి ఇంటికి ఉన్నాయా, వాటి వినియోగం ఎలా ఉందో పరిశీలించారు. ఇంకుడుగుంత, శానిటేషన్ పరిశీలించారు. తడి, పొడిచెత్త ఇంటి నుంచి సేకరించి దాన్ని డంపింగ్ యార్డుకు తరలించి సేంద్రీయ ఎరువుగా మారుస్తున్నారా లేదా అనే విషయంపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణులు ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటున్నారనే వివరాలు అడిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, మౌలికవసతుల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలేదీక్ష

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో ఇసుక లారీలకు తాటిపత్రులు కప్పే ఉపాధి కల్పించాలని కోరుతూ గురువారం నుంచి జీపీ ఆవరణలో రిలే దీక్ష చేపట్టనున్నామని గ్రామస్తులు పోలీసులకు వినతి పత్రం అందజేశారు. మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారని, కొండపాక గ్రామస్తులు మాత్రమే ఉపాధి పొందుతున్నారని, హిమ్మత్‌నగర్ గ్రామస్తులకు ఉపాధి కల్పించాలన్నారు. ధర్నాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని, ఇరిగేషన్ అధికారులు, క్వారీ నిర్వాహకులు కుమ్మక్కై సమస్యను పరిష్కరించడంలేదని వాపోయారు.

ఊరి మధ్యలో నుంచి రోడ్డు వేయొద్దని ధర్నా


రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చిగురుమామిడి: ఫోర్‌లైన్ రోడ్డు ఊరి బయట నుంచి వేయాలని మండలంలోని సుందరగిరి గ్రామస్తులు బుధవారం ధర్నా నిర్వహించారు. హుస్నాబాద్-కరీంనగర్ ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. ఊరి మధ్య నుంచి రోడ్డు వేయడం వల్ల ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని, ఊరిబయట నుంచి రోడ్డు వేస్తే నష్టపోకుండా ఉంటమన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీజేపీ నాయకులు బాకం సంపత్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పైడిపెల్లి అంజయ్య, కక్కెర్ల వెంకటేశం, సీపీఐ నాయకులు రాజు, మహేందర్ పలువురు పాల్గొన్నారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: తెలంగాణను పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమం కొనసాగుతుందని, సొంతింట కల కాంగ్రెస్‌తోనే సాకారం సాధ్యమవుతుందన్నారు.కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అల్గునూరులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ పథకాలు అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన గత పాలకులు రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచారని, అప్పులకు వడ్డీలు కట్టేందుకు మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి కల్పించారని, కాంగ్రెస్ మాటకు కట్టుబడే పార్టీ అని, గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదల ఆశలు ఆవిరి చేశారని విమర్శించారు. నిరుపేదలందిరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నివేశన స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వపరంగా ఇళ్ల స్థలాలు త్వరలో ఇస్తామని, అందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, తమ్మనవేని రమేశ్ యాదవ్, కుంట రాజేందర్ రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, కంది అశోక్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కాల్వ స్వప్న మల్లేశం, అయితం లావణ్య మహేష్, పి.మహేష్, దాసం నాగేందర్, తొర్తి అరవింద్, కె.కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

అల్గునూర్ గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.ఐదు లక్షలతో పునర్నిర్మించిన కబరస్తాన్‌ను ఆయన ప్రారంభించారు. ఎల్ఎండీ కాలనీలోని పంచముఖి హనుమాన్ ఆలయం నుంచి మహాత్మానగర్ గ్రామ పంచాయతీ వరకు రూ.54.లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సీసీరోడ్డు నిర్మాణ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించి రోడ్డుకు అవసరమైన నిధులు మంజూరు చేశారని నాయకులు తెలిపారు.

పలువురికి సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు


జమ్మికుంటరూరల్: ఎంపీడీవోకు జ్ఞాపిక అందజేస్తున్న కార్యదర్శులు, సిబ్బంది


హుజూరాబాద్: రిటైర్డ్ ఈఈ మల్లారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కొయ్యడ శ్రీదేవి

హుజూరాబాద్: మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు వంద రోజుల కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముందుకు తీసుకపోతున్న మున్సిపల్ కమిషనర్ కెంసారపు సమ్మయ్య, ఏఈ సాంబరాజును తెలంగాణ ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గొస్కుల ముత్యంరాజు, బి.కిషన్‌రెడ్డి, మార్త రవీందర్, ఈ.వెంకటరాంనర్సయ్య, వేల్పుల ప్రభాకర్, ఏం.కొమురయ్య, పీఎస్‌రెడ్డి, బత్తుల సంజీవ్, గంగరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఈఈకి సన్మానం...

హుజూరాబాద్: పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన కట్కూరి మల్లారెడ్డి కరీంనగర్ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ ఈఈగా పదవీ విరమణ పొందగా బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు, మాజీ కౌన్సిలర్ కొయ్యడ శ్రీదేవి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రిటైర్డ్ ఈఈ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు..

జమ్మికుంటరూరల్: జమ్మికుంట ఎంపీడీవో భీమేష్ బదిలీపై జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌కు వెళ్లారు. ఈసందర్భంగా జమ్మికుంట ఎంపీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బుధవారం ఎంపీడీవోను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, మహేందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి ..

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకురాలు పులాల సుమలత పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపకులు బుధవారం సుమలతను ఘనంగా సన్మానించారు. ఇటీవల కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథాపాలకుడు రాంమోహన్, అధ్యాపకులు శోభన్, భాస్కర్, రవీందర్, కరుణ, కత్తెరశాల, స్వప్న, జైపాల్ రెడ్డి, శైలజ, కల్పన ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

- **అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన**

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర కమిటీ సభ్యులు పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, అందుతున్న సేవలు, సౌకర్యాలు, కిచెన్ గార్డెన్‌తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు.

- **స్కూలు బ్యాగులు పంపిణీ**

గంగాధర: మండలంలోని నారాయణపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు అందజేసిన స్కూల్ బ్యాగులను బుధవారం మాజీ సర్పంచ్ నజీర్ విద్యార్థులకు అందజేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు నల్ల సందీప్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి పాఠశాలలోని ముప్పై మంది విద్యార్థులకు బ్యాగులు సమకూర్చారు.

- **విద్యార్థుల క్షేత్ర సందర్శన**

జమ్మికుంట: పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం, గ్రామీణ జీవితం, వ్యవసాయంలో రైతు పాత్ర తదితర అంశాలు నేర్చుకున్నారని తెలిపారు.

- **పది మందికి జరిమానా**

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన పది మందికి హుజూరాబాద్ కోర్టు న్యాయమూర్తి జరిమానా వేశారని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

- **రోడ్డు ప్రమాదంలో గాయాలు**

మానకొండూర్: మండలంలోని వేగురుపల్లి హెల్త్ సబ్‌సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న స్వప్న(30) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. స్వప్న తలకు గాయం కావడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు..

- **అట్రాసిటీ కేసు**

జమ్మికుంట: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై బుధవారం అట్రాసిటీ కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మున్సిపల్ పరిధి మోత్కుల గూడెం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పట్టణంలోని శాలవాడలో కారు పార్కింగ్ చేస్తున్న సమయంలో అదే కాలనీకి చెందిన వ్యక్తి కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

- **దాడికి పాల్పడిన ఐదుగురిపై...**

ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టణానికి చెందిన సిలువేరు శ్రీకాంత్‌పై ఐదుగురు దాడికి పాల్పడ్డారని, అడ్డు వచ్చిన తల్లిని బూతులు తిట్టారని బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.